సాక్షి
వైఎస్సార్ జిల్లా
మంగళవారం । 17 । డిసెంబర్ । 2024



నడిరోడ్డు పైనే ప్రసవం

కడప నగరంలో నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళకు పురిటి నొప్పులు అధికం కావడంతో.. నడిరోడ్డు పైనే పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. -8లో



ప్రొద్దుటూరుకు తిరిగి అటవీ డివిజన్

ప్రొద్దుటూరులో తిరిగి అటవీ డివిజన్ ఏర్పాటు కానుంది. వీటికి సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి వెళ్లినట్లు ఉన్నతాధికారులు చెబుతున్నారు. -8లో

గరిష్టం/కనిష్టం
29.2/18.4


వాతావరణం

జిల్లాలో సోమవారం 18.4 - 29.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఫొటో, వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణ



కడప కోటిరెడ్డిసర్కిల్: కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి ఫొటో, వీడియోగ్రఫీ, సెల్‌ఫోన్ రిపేరింగ్, సర్వీసింగ్, రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండీషనింగ్‌లో ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఆరీఫ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల రోజుల పాటు ఇచ్చే శిక్షణకు 18–45 ఏళ్ల మధ్య వయసు గల వారు అర్హులని ఆయన పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత యువకులకు ప్రాధాన్యత ఇస్తారని, దూర ప్రాంతాల వారికి ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తారన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు : 94409 05478, 99856 06866లలో సంప్రదించాలని వివరించారు.

19 నుంచి క్రీడా పోటీలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక కొర్రపాడు రోడ్డులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 19 నుంచి 21 వరకు కడప రీజనల్ స్థాయి 27వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్, గేమ్స్ బాలుర క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జింకా అశోక్‌బాబు తెలిపారు. ఈ క్రీడా పోటీలకు సంబంధించిన పోస్టర్లను సోమవారం కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 384 మంది క్రీడాకారులు పాల్గొంటారన్నారు. వీరికి చెస్, వాలీబాల్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, 100 మీ, 200 మీ, 400 మీ, 800 మీ, 1500 మీ, 100 మీటర్లు, 4 రిలే, హైజంప్, లాంగ్‌జంప్, బ్రాడ్‌జంప్, ట్రిపుల్ జంప్, డిస్కస్‌త్రో, జావెలిన్‌త్రో తదితర విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పింఛా డ్యాం నీటి సంఘం ఎన్నిక



సుండుపల్లె(రాజంపేట): పింఛా డ్యాం నీటి సంఘం ఎన్నికను మంగళవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు పింఛా డ్యాం ఏఈ, ఎన్నికల అధికారి బుక్కే నాగేంద్రనాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయకట్టుదారులు నోటిఫికేషన్‌లో పొందుపరిచిన విధంగా ఎన్నిక జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఆరు టీసీలకు ఎన్నికలు జరుగుతాయని వివరించారు. కాగా ఘర్షణ వాతావరణం కారణంగా ఈ నెల 14న జరగాల్సిన ఎన్నిక వాయిదా పడిన విషయం తెలిసిందే.

అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రాఘవరెడ్డి



రాఘవరెడ్డిని సన్మానిస్తున్న బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఆనందరెడ్డి, సిబ్బంది


మదనపల్లె: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల సంఘం(జీసీటీఏ ఏపీ) రాష్ట్ర అధ్యక్షుడిగా పట్టణంలోని బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్.మలిగి రాఘవరెడ్డి ఎన్నికయ్యారు. విజయవాడ ఎస్ఆర్ఆర్, సీవీఆర్ కళాశాల వేదికగా ఆదివారం జరిగిన 37వ జీసీటీఏ ఏపీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం అనంతరం జరిగిన కేంద్రస్థాయి ఎన్నికల్లో 201–30 ఓట్ల తేడాతో తన ప్రత్యర్థిపై రాఘవరెడ్డి విజయం సాధించారు. ఈ సందర్భంగా సోమవారం బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు రాఘవరెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.జి.ఆనందరెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్.జి.శ్రీదేవి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికా.. మేలుకో



రోజంతా రెక్కాడితే గానీ డొక్కాడని కూలీ కుటుంబాలవి. చేతినిండా పని దొరికితేనే కడుపు నిండేది. లేకపోతే పస్తులు ఉండాల్సి వస్తుంది. భవన నిర్మాణ రంగంలో పని చేసే దినసరి కార్మికుల పరిస్థితి ఇలా ఉంటుంది. ఈ క్రమంలోనే వారి సంక్షేమం కోసం కార్మిక శాఖ పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టింది. అయితే, ఈ ప్రయోజనాలను అందిపుచ్చుకోవాలంటే రిజిస్ట్రేషన్ కార్డు అవసరం ఉంటుంది. ఇందులో సభ్యుడిగా చేరడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయి. ఈ నేపథ్యంలోనే ఈ కార్డును ఎలా తీసుకోవాలి? ఇందువల్ల కలిగే ఉపయోగాలు ఏంటో తెలుసుకుందాం.

- గుర్తింపు కార్డులకు ఎంతో మంది దూరం
- ఒకసారి పొందితే అనేక ప్రయోజనాలు
- నైపుణ్య శిక్షణ, పింఛన్‌కు అవకాశం
- పిల్లలకు ఉచిత విద్య, వివాహాలకు నగదు సాయం



కడప కోటిరెడ్డిసర్కిల్: భవన నిర్మాణ రంగ కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని ద్రాక్షలా మారాయి. రిజిస్ట్రేషన్ చేసుకున్న కార్మికులకు సంబంధించి కడప నగరంతోపాటు జిల్లా వ్యాప్తంగా 3,65,648 మందికి పైగా కార్మికులు ఉన్నారు. అయితే గుర్తింపు కార్డు పొందని కార్మికులు కూడా అధిక సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తోంది. భవన నిర్మాణ రంగంతోపాటు పెయింటర్లు, కార్పెంటర్లు, ప్లంబర్లుగా అనేక మంది పని చేస్తున్నారు. ప్రస్తుతం కార్మికులు రోజూ పని కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. కడప నగరంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ఉదయం జెడ్పీ కార్యాలయం, అప్సర సర్కిల్‌లోని అడ్డాలకు చేరుకుని వేచి చూస్తుంటారు. కొందరికి పని దొరుకుతున్నా, మరికొందరు ఇబ్బంది పడుతున్నారు.

వివిధ వృత్తుల్లో..

భవన నిర్మాణ రంగానికి సంబంధించి పలు విభాగాల కార్మికులు పని చేస్తున్నారు. మట్టి పని, పునాది గుంతలు తీయడం, చదును, తాపీ మేస్త్రీ, కూలీలు, రాడ్‌బెండింగ్, కార్పెంటర్లు, పెయింటర్లు, సెంట్రింగ్, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, పాలిష్ వేసే వారు ఉన్నారు. సీలింగ్, కంకర కార్మికులు, రోడ్డు నిర్మాణ కూలీలు, క్రేన్, పొక్లెయినర్ ఆపరేటర్లు తమ పనులు చేసుకుంటూ జీవిస్తుంటారు. చెరువులు తవ్వడం, పూడిక తీయడం, బోర్‌వెల్స్, సిమెంటు ఇటుకలు తయారు చేసే వారు ఇదే రంగంపై ఆధారపడి ఉన్నారు. వీరికి ప్రభుత్వం గుర్తింపు కార్డులు మంజూరు చేయడంతోపాటు పని భద్రత కల్పించాలి. గుర్తింపు కార్డులు పొందాలంటే కార్మిక శాఖ కార్యాలయంలో ఆధార్, రెండు ఫొటోలు, నామిని ఆధార్ కార్డుతోపాటు రూ.50 సభ్యత్వ రుసుం చెల్లించాలి.

అవగాహన లేమితో నష్టపోతున్న వైనం

కార్మికులకు అవగాహన లేకపోవడంతో ఎక్కువ మంది గుర్తింపు కార్డులు పొందలేకపోతున్నారు. కార్డులు కలిగిన కార్మికులకు నైపుణ్యం పెంచుకునేందుకు శిక్షణ ఇవ్వాల్సి ఉండగా, శిక్షణ కాలంలో రూ.300 స్టయిఫండ్ ఇస్తారు. అలాగే 60 ఏళ్లు దాటిన కార్మికులకు రూ.1000–5000 పెన్షన్ అందజేస్తారు. కార్మికుల పిల్లలకు ఉచిత విద్య, వివాహాలకు నగదు అందిస్తారు. భవన యజమానులు నిర్మాణ రిజిస్ట్రేషన్ చేసి.. పని చేసే కార్మికుల పేరిట ఒక శాతం కార్మిక శాఖకు సెస్ చెల్లించాలి. వీటిపై అధికారులు సరైన అవగాహన కల్పించకపోవడంతో కార్మికులు నష్టపోతున్నారు. ఈ విషయాలపై అధికారులు అవగాహన కల్పించి.. అన్ని పథకాలు అందేలా చూడాలని పలువురు కార్మికులు కోరుతున్నారు.



కార్మికుల వివరాలు నమోదు చేస్తున్న కార్మిక శాఖ అధికారులు

జిల్లాలో రిజిస్ట్రేషన్ చేసుకున్న కార్మికుల వివరాలు

వ్యవసాయ:	216011
భవన నిర్మాణం :	34,201
అపెరల్:	30,373
ఆటోమొబైల్, రవాణా రంగం:	15727
హ్యాండీక్రాఫ్ట్, కార్పెట్స్:	11052
ఇతర కార్మికులు:	10396
ఎలక్ట్రానిక్స్:	6437
హెల్త్ కేర్:	5403
క్యాపిటల్ గూడ్స్ మ్యానుఫాక్చరింగ్:	4890
డొమెస్టిక్ హౌస్‌హోల్డ్ వర్కర్స్:	4649
ఎడ్యుకేషన్:	3333
రీటైల్:	3239
ఆఫీసు అడ్మినిస్ట్రేషన్ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్:	3063
లెదర్ ఇండస్ట్రీ వర్క్స్:	2506
సర్వీస్:	2253
పొగాకు ఉత్పత్తులు:	1977
ప్రొఫెషనల్స్:	1824
జెమ్ జువెలరీ:	1744
ఫుడ్ ఇండస్ట్రీ:	1698
బ్యూటీ వెల్‌నెస్:	1485
టూరిజం హాస్పిటాలిటీ:	1470
ప్రింటింగ్:	637
మైనింగ్:	523
మొత్తం:	365648

చైతన్య పరుస్తున్నాం



అర్హులను గుర్తించి కార్డులను అందజేస్తున్నాం. ఇంకా పొందని వారిని చైతన్య పరుస్తున్నాం. కార్మికులు కూడా తమవంతుగా స్పందించి సభ్యత్వం తీసుకునేందుకు ముందుకు రావాలి. కార్మికుల సంక్షేమానికి అనేక చర్యలు చేపడుతున్నాం.

– శ్రీకాంత్‌నాయక్, కార్మిక శాఖ అధికారి, కడప

'గుడ్ గవర్నెన్స్ వీక్'ను విజయవంతం చేయండి

- డీఆర్వో విశ్వేశ్వర్ నాయుడు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న డీఆర్వో, జిల్లా అధికారులు

కడప సెవెన్‌రోడ్స్: 'ప్రశాసన్ గావోన్ కి ఓర్–2024' కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా ఈ నెల 19 నుంచి 24 వరకు జరిగే గుడ్ గవర్నెన్స్ వీక్ (జీజీడబ్ల్యూ) క్యాంపెయిన్ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని డీఆర్వో విశ్వేశ్వర్ నాయుడు అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఢిల్లీ నుంచి భారత ప్రభుత్వ పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం (డీఏఆర్‌పీజీ) కార్యాలయం నుంచి గుడ్ గవర్నెన్స్ వీక్ (జీజీడబ్ల్యూ) క్యాంపెయిన్ ప్రచార ప్రణాళికపై.. వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశాల మేరకు స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి డీఆర్వోతోపాటు జిల్లా పరిషత్ సీఈవో ఓబులమ్మ, ఇన్‌చార్జి సీపీవో హజరతయ్య, డీఐఓ విజయ్‌కుమార్, డీపీఆర్వో వేణుగోపాల్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం డీఆర్వో మాట్లాడుతూ 'ప్రశాసన్ గావోన్ కి ఓర్' – 2024 కార్యక్రమం నిర్వహణకు జిల్లాలో విస్తృతమైన ప్రచారం చేసి, ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. భారత ప్రభుత్వ పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం ఆధ్వర్యంలో సాగుతున్న ఈ ప్రచార కార్యక్రమంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి, పబ్లిక్ సర్వీస్ డెలివరీని మెరుగుపరచడానికి జిల్లా యంత్రాంగం చేపడుతున్న చర్యలపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని వివరించారు.

ఏడుగురు కార్పొరేటర్లు సస్పెన్షన్

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్ రెడ్డి

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థలో ఏడుగురు కార్పొరేటర్లు, నలుగురు పార్టీ నాయకులను సస్పెండ్ చేసినట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2వ డివిజన్ కార్పొరేటర్ ఎం.సుబ్బారెడ్డి, 3వ డివిజన్ కార్పొరేటర్ ఎం.మానస, 6వ డివిజన్ కార్పొరేటర్ నాగేంద్రప్రసాద్, 8వ డివిజన్ కార్పొరేటర్ ఎ.లక్ష్మీదేవి, 32వ డివిజన్ కార్పొరేటర్ ఎస్‌బీ జఫ్రుల్ల, 42వ డివిజన్ కార్పొరేటర్ సి.స్వప్న, 50 డివిజన్ కార్పొరేటర్ కె.అరుణ ప్రభ, పార్టీ నాయకులు ఎం.సుదర్శన్‌రెడ్డి, బాలకృష్ణారెడ్డి, చల్లా రాజశేఖర్, కె.రాజ శేఖర్‌రెడ్డిలను పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న దృష్ట్యా సస్పెండ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. త్వరలోనే ఆయా డివిజన్‌లకు కొత్త ఇన్‌చార్జిలను నియమిస్తామని వివరించారు.

శ్రీ వీరభద్రస్వామి హుండీ ఆదాయం లెక్కింపు



నగదును లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, భక్తులు

రాయచోటి టౌన్: రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. ఆలయంలోని వినాయకుడు, శ్రీ అఘోరలింగేశ్వరుడు, శ్రీ వీరభద్రస్వామి, శ్రీ భద్రకాళీ అమ్మవారి ఆలయాలకు చెందిన హుండీ ఆదాయాలను లెక్కించారు. 171 రోజులకు సంబంధించి స్వామి వారికి రూ.45,23,541 ఆదాయం వచ్చింది. 47 గ్రాముల బంగారం, 4.3 కిలలో వెండి ఆభరణాలు కూడా వచ్చినట్లు ఆలయ అధికారులు చెప్పారు. ఈ మొత్తాన్ని కెనెరా బ్యాంక్‌లో జమ చేశారు.కార్యక్రమంలో దేవదాయశాఖ ప్రత్యేక అధికారి ఎం. రవి కుమార్, ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

కోడిగుడ్డు అధరహో!

రాయచోటి: కోడిగుడ్డు ధరలు మాత్రం వేడి చేయకుండానే ఉడికిపోతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా రిటైల్ మార్కెట్‌లో ఒక్కో గుడ్డు రూ.7.50లకు విక్రయిస్తున్నారు. కూరగాయలతో పాటు కోడి గుడ్డు ధరలు కూడా కొండెక్కడంతో కొనుగోలుదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. తెలుగు రాష్ట్రాల్లో కోళ్ల పెంపకం అధికం కావడంతో పాటు కోడిగుడ్ల రేటు కూడా సామాన్యులకు అందుబాటులో ఉండేది. అయితే పక్క రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు సబ్సిడీలు ఇవ్వడంతో పౌల్ట్రీ ఫామ్స్ పెరిగిపోయాయి. ఫలితంగా ఏపీ నుంచి ఎగుమతులు తగ్గిపోయినట్లు సమాచారం. కోడిగుడ్ల ఉత్పత్తి తగ్గిపోయింది. దీంతో చాలా చోట్ల మన రాష్ట్రంలో పౌల్ట్రీ ఫామ్స్ మూసివేశారు.ఫలితంగా కోడిగుడ్డు రేటు పెరిగిపోయింది. పెరిగిన భారం వినియోగదారుడి నెత్తినపడటంతో గుడ్డు రేటుకు రెక్కలు వచ్చాయి.

ఉత్పత్తికి పెరిగిన ఖర్చు: ఒక గుడ్డు ఉత్పత్తికి పౌల్ట్రీలలోనే రూ.5 వరకు ఖర్చవుతోందని వ్యాపారులు చెబుతున్నారు. చిత్తూరు, తిరుపతి, హైదరాబాద్ ప్రాంతాల నుంచి మన ప్రాంతాలకు గుడ్ల సరఫరా జరుగుతుంటుంది. అక్కడ నుంచి ఇక్కడికి చేరుకొని వినియోగదారునికి అందడానికి రూ.7.50 పడుతోందని చెబుతున్నారు. ఆగస్టులో గుడ్డు రేటు రూ.5.70గా ఉంటే ప్రస్తుతం అది రూ.7.50కి చేరింది. ఈజీగా చేసుకోవడంతో పాటు బలవర్థకమైన ఆహారం కావడంతో చాలా మంది గుడ్డుని ప్రిఫర్ చేస్తారు. బేకరీ ఫుడ్స్‌లో కూడా కోడి గుడ్ల వినియోగం ఎక్కువగా ఉంటుంది. దాంతో వాటి రేట్లు కూడా పెరిగిపోతున్నాయని కొనుగోలుదారులు వాపోతున్నారు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న కోడిగుడ్లు

సంవత్సరాల వారీగా కోడిగుడ్డు ధరలు(రూ.లలో)

2020 :	5.95
2021 :	5.26
2022 :	5.39
2023 :	6.20
2024 :	7.50

విద్యార్థులకు కష్టమే



పెరిగిన ధరలతో విద్యార్థులకు గుడ్డు అందుతుందన్న ఆశలు కనిపించడం లేదు. అనుకూలమైన ధరలు ఉన్న సమయంలోనే గోలీల సైజులో ఉన్న గుడ్లనైనా అందించేవారు. నేడు పెరిగిన ధరల కారణంగా ఆ చిన్న గుడ్లు కూడా విద్యార్థులకు అందకుండా పోతున్నాయన్న భయం నెలకొంది.

ఈ పంట.. రైతుకు బాసట

- ప్రారంభమైన రబీ పంటల నమోదు
- పేరుంటేనే ప్రభుత్వ పథకాల వర్తింపు
- ఫిబ్రవరి 25 వరకు గడువు





వేంపల్లె మండలం రామిరెడ్డిపల్లెలో ఈ పంట నమోదు చేస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్

కడప అగ్రికల్చర్: ఈ పంట నమోదు రైతులకు బాసటగా నిలుస్తోంది. ప్రకృతి విపత్తుల నుంచి పంట నష్టం వాటిల్లిన సందర్భాల్లో.. పరిహారం పొందేందుకు ఉపయోగ పడుతుంది. ప్రభుత్వం నుంచి రాయితీ, వ్యవసాయ పథకాలు, ఇన్సూరెన్స్ వంటి లబ్ధిని అందుకోవడానికి దోహదం చేస్తుంది. ఏది వర్తింప చేయాలన్నా ఈ పంట నమోదును ప్రభుత్వం తప్పనిసరి చేసింది. దీంతో ప్రతి రైతు తమ పంటల సాగు వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రబీలో ఈ పంట(క్రాప్) నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల పరిధిలో అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లు ముమ్మరంగా పంటల నమోదు చేపడుతున్నారు.

ప్రత్యేక యాప్

ఈ పంట నమోదుకు ప్రభుత్వం ప్రత్యేక యాప్ రూపొందించింది. జిల్లా వ్యాప్తంగా 36 మండలాల్లో 432 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలోని రైతులు యాప్ ద్వారా సాగు చేసిన పంట రకం, సర్వే నంబర్, సాగు విస్తీర్ణం, నీటి వనరులు వంటి సమచారాన్ని నమోదు చేయించుకోవాలి. ఎంపిక చేసిన సర్వే నంబర్‌లోని పొలానికి అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లు వెళ్తున్నారు. రైతుతోపాటు సాగు చేసిన పంట ఫొటోను వారు తీసి ప్రత్యేక యాప్‌లో పొందుపరుస్తున్నారు. ఈ కార్యక్రమం వచ్చే ఏడాది ఫిబ్రవరి 25 వరకు కొనసాగనుంది.

ఈ క్రాపు నమోదు వివరాలు...

జిల్లాలో 2,43,857 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇప్పటి వరకు 92,489 ఎకరాల్లో ఈ పంట నమోదు ప్రక్రియ పూర్తయింది. ఇంకా 1,51,368 ఎకరాలు నమోదు చేయాల్సి ఉంది.

ఈ పంట నమోదు సమాచారం

- ప్రారంభం : నవంబర్ 28
- గడువు : 2025 ఫిబ్రవరి 25
- గ్రామసభలు : మార్చి 1 నుంచి 5
- సోషియల్ ఆడిట్, గ్రీవెన్స్ సెల్ : మార్చి 6 నుంచి 10
- తుది జాబితా ప్రదర్శన : మార్చి 15
- జిల్లాలో సాగైన పంట : 243857 ఎకరాలు
- నమోదైన పంటలు: 92,489 ఎకరాలు

నమోదు చేయించుకోవాలి




రైతులు తమ పంటల సాగు వివరాలు నమోదు చేయించుకోవాలి. ప్రభుత్వం నుంచి పథకాలు, పరిహారం ఈ పంట నమోదు చేయించుకున్న వారికే అందుతాయి. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ప్రతి రైతు నమోదు చేయించుకోవాలి.

– అయితా నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి

అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్



ప్రజల అర్జీలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీలకు త్వరితగతిన, నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం సభా భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, పారదర్శకంగా విచారణ చేసి, నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వర్ నాయుడు, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, జిల్లా వ్యవసాయశాఖాధికారి నాగేశ్వరరావు, ఎస్డీసీలు వెంకటపతి, వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

• నడిరోడ్డుపైనే ప్రసవం



బిడ్డ పుట్టుక ప్రతి తల్లికీ ఓ మధుర క్షణం. ప్రసవ వేదన ఎంత వేధిస్తున్నా ప్రతి నొప్పినీ సంతోషంగా భరిస్తుంది. బిడ్డకు జన్మనిస్తుంది. కానీ దురదృష్టవశాత్తు ఓ తల్లికి పురిటినొప్పులు మొదలైతే ఆదరించే వారు లేరు. ఆశ్రయం ఇచ్చేవారు కరువయ్యారు. చివరకు నడి రోడ్డుపైనే ప్రసవించింది. ఓ పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. హృదయాలను కదిలించే ఈ సంఘటన కడప నగరంలో చోటుచేసుకుంది. సోమవారం సాయంత్రం.. కడప నగరం జన సమ్మర్థంతో కిటకిటలాడుతోంది. ఎవరి పనిమీద వారు బిజీగా వెళ్లిపోతున్నారు. పక్కన ఏం జరుగుతోందో గమనించే తీరిక..ఓపిక ఎవరికీ లేదు. ఈ నేపథ్యంలో రోజులాగే కడప నగరం శంకరాపురం విద్యుత్‌సబ్ స్టేషన్ సమీపంలో ఓ యువతి రోడ్డు వెంట నడుస్తూ వెళుతోంది. ఒక్కసారిగా పురిటి నొప్పులు మొదలయ్యాయి. ఎవరూ తోడు లేరు. ఒక్కతే.. పంటి బిగువున పురిటి నొప్పులు భరిస్తూ మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఆమె ఎక్కడి నుంచి వచ్చిందో ఎవరికీ తెలియదు. నా అన్న వారెవ్వరో తెలియదు. కడప నగరంలో అక్కడా ఇక్కడా యాచన చేస్తూ బతుకీడ్చేది. ఆమె గర్భం దాల్చింది. నవ మాసాలు నిండాయి. కాన్పు కోసం ఆసుపత్రికి వెళ్లే ఆలోచన.. స్పృహ ఆమెకు అస్సలు లేదు. జనం మధ్యలో నడిరోడ్డుపైనే ఆమె ప్రసవించడంతో అటుగా వెళ్తున్న వారు ఈ దృశ్యాన్ని చూసి చలించిపోయి అయ్యో.. పాపం అంటూ 108కు సమాచారం అందించారు. వారు వచ్చి పసికందుతోపాటు తల్లిని నగరంలోని రిమ్స్‌కు తరలించారు. ఒకవేళ ఆ అమ్మే మరణించి ఉంటే ఆ పాపం ఎవ్వరిదంటూ అక్కడి జనం ప్రశ్నిస్తూ వెళ్లిపోయారు.

– కోటిరెడ్డి సర్కిల్

ప్రొద్దుటూరుకు తిరిగి అటవీ డివిజన్

- ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిన అధికారులు
- ప్రొద్దుటూరులో కొత్తగా బి.మఠం రేంజ్ ఏర్పాటు
- త్వరలో రానున్న ఉత్తర్వులు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులో తిరిగి అటవీ డివిజన్ ఏర్పాటు కానుంది. జిల్లాల పునర్విభజనలో భాగంగా ప్రొద్దుటూరు డివిజన్‌ను కడప డివిజన్‌లో ఏర్పాటు చేశారు. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ ప్రక్రియను చేపట్టారు. అయితే పరిపాలనా సౌలభ్యం కోసం విస్తీర్ణం ఎక్కువగా ఉన్న డివిజన్‌లను తిరిగి విభజించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో భాగంగా ప్రొద్దుటూరుతో పాటు రాష్ట్రంలో రెండు, మూడు చోట్ల తిరిగి గతంలో ఉన్న డివిజన్‌లను కొనసాగించనున్నట్లు తెలుస్తోంది. వీటికి సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి వెళ్లాయని, మరి కొన్ని రోజుల్లో ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉన్నట్లు ఉన్నతాధికారులు చెబుతున్నారు.

జిల్లాల విభజనతో కడపలో విలీనం

2022 నవంబర్‌లో ప్రొద్దుటూరు అటవీ డివిజన్‌ను కడపలో కలిపారు. ప్రభుత్వం చేపట్టిన జిల్లాల పునర్విభజనలో భాగంగా జిల్లాకు ఒక అటవీ డివిజన్ మాత్రమే ఉండాలని నాటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ కారణంగా ప్రొద్దుటూరును కడప అటవీ డివిజన్‌లో విలీనం చేయడం అనివార్యమైంది. దీంతో అప్పటి నుంచి పోరుమామిళ్ల, వనిపెంట, ప్రొద్దుటూరు, ముద్దనూరు రేంజ్‌లతో కలిపి ప్రొద్దుటూరు అటవీ సబ్‌డివిజన్‌గా కొనసాగుతోంది.



ప్రొద్దుటూరులోని అటవీశాఖ కార్యాలయం

పాలనా సౌలభ్యం కోసమే జిల్లాలో రెండు డివిజన్‌లు

గతంలో ప్రొద్దుటూరు డివిజన్‌లో ప్రొద్దుటూరు, వనిపెంట, ముద్దనూరు, పోరుమామిళ్ల, బద్వేల్ రేంజ్‌లు ఉండేవి. వీటిని కడపలో కలిపారు. కడప, సిద్దవటం, ఒంటిమిట్ట, వేంపల్లె రేంజ్‌లతో కలిపి 9 రేంజ్‌లతో కడప అటవీ డివిజన్ ఏర్పాటైంది. కడప డివిజన్‌లో ప్రొద్దుటూరు విలీనం కావడంతో 2,98,726 హెక్టార్ల అటవీ విస్తీర్ణంతో రాష్ట్రంలోనే అతిపెద్ద డివిజన్‌లలో ఒకటిగా కడప అటవీ డివిజన్ నమోదైంది. విస్తీర్ణం ఎక్కువగా ఉండటంతో వణ్యప్రాణి సంరక్షణ, విలువైన ఎర్రచందనం, అటవీ కలపను సంరక్షించడం, వాటి పర్యవేక్షణ కష్టసాధ్యమని భావించిన ఉన్నతాధికారులు పరిపాలనా సౌలభ్యం కోసం తిరిగి జిల్లాలో రెండు డివిజన్‌లను ఏర్పాటు చేయనున్నారు. అయితే గతంలో కడపలో నాలుగు రేంజ్‌లు ఉండగా బద్వేల్‌ను కడపలో కలపనున్నారు. కొత్తగా బి.మఠం రేంజ్‌ను ఏర్పాటు చేసి ప్రొద్దుటూరు డివిజన్‌లో ఐదు రేంజ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. త్వరలోనే ఉత్తర్వులు రానున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

1964లో ఏర్పాటైన ప్రొద్దుటూరు అటవీ డివిజన్

ప్రొద్దుటూరు అటవీ డివిజన్ 1964లో ఏర్పాటైంది. డివిజన్ కార్యాలయాన్ని ఎర్రగుంట్ల రోడ్డులోని పాత పీఎంఎఫ్ ఫ్యాక్టరీ ఎదురుగా ఏర్పాటు చేశారు. 1964 ఏప్రిల్ 15న అటవీ డివిజన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం జీఓ నంబర్ 1735ను జారీ చేయగా అదే ఏడాది జూలై 1 నుంచి ఇక్కడి కార్యాలయంలో కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. మొదట్లో రాయచోటి, వేంపల్లె, ముద్దనూరు, ప్రొద్దుటూరు, వనిపెంట ఫారెస్ట్ రేంజ్ కార్యాలయాలు ప్రొద్దుటూరు డివిజన్ పరిధిలో ఉండేవి. అయితే పాలనా సౌలభ్యం కోసం 1966లో రేంజ్‌లను మార్పు చేశారు. 1966 జనవరి 18 నుంచి ప్రొద్దుటూరు, ముద్దనూరు, బద్వేల్, పోరుమామిళ్ల, వనిపెంట రేంజ్‌లతో కలిపి అటవీ డివిజన్ ఏర్పాటైంది. ప్రొద్దుటూరు అటవీ డివిజన్ పరిధి సుమారు 1,64,516.52 హెక్టార్ల విస్తీర్ణంలో ఉంది. ఇందులో సుమారు 1 లక్ష హెక్టార్లలో ప్రపంచంలోనే అరుదైన ఎర్రచందనం చెట్లు విస్తరించి ఉన్నాయి. 1964 నుంచి ప్రొద్దుటూరులో 30 మంది డీఎఫ్‌ఓలు పని చేశారు. తిరిగి ప్రొద్దుటూరుకు అటవీ డివిజన్ రానుండటంతో ప్రొద్దుటూరు ప్రజలు, పర్యావరణ ప్రేమికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం



ప్రొద్దుటూరులో తిరిగి అటవీ డివిజన్ ఏర్పాటు కానుంది. ప్రభుత్వ ఆదేశాలతో డివిజన్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపించాం. జిల్లాలో అటవీ విస్తీర్ణం ఎక్కువగా ఉండటంతో తిరిగి ప్రొద్దుటూరు డివిజన్‌ను కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కొత్తగా ఏర్పాటు కానున్న బి.మఠం రేంజ్‌తో కలిపి ఐదు ఫారెస్ట్ రేంజ్‌లతో ప్రొద్దుటూరు అటవీ డివిజన్ ఏర్పాటు కానుంది. దీనికి సంబంధించిన ఉత్తర్వులు త్వరలోనే వచ్చే అవకాశం ఉంది.

– దివాకర్, సబ్ డీఎఫ్‌ఓ, ప్రొద్దుటూరు

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రజలు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగు న్యాయం జరిగేలా చూడాలని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) ప్రకాష్‌బాబు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'(పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) ప్రకాష్ బాబు ఫిర్యాదుదారులతో స్వయంగా ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు.

నలుగురిపై కేసు నమోదు

సిద్దవటం : మండలంలోని టక్కోలు గ్రామం అరుంధతి వాడలో ఆదివారం రాత్రి జరిగిన ఘర్షణలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ సుబ్బరామచంద్రరాజు తెలిపారు. ఆదివారం రాత్రి టక్కోలు అరుంధతీవాడలో బాలమునెయ్య, జేమ్స్‌బాబు కుటుంబాల మధ్య ఉన్న పాత కక్షల నేపథ్యంలో బాలచైతన్య అనే వ్యక్తి ఈశ్వరయ్యను తిట్టాడన్నారు. తమ తమ్ముడిని ఎందుకు తిడుతున్నావని ఈశ్వరయ్య అన్న మల్లికార్జున ప్రశ్నించడంతో ఇరు కుటుంబాల వారు ఘర్షణ పడ్డారన్నారు. ఈ ఘర్షణలో కర్రలతో దాడి చేయడంతో మల్లికార్జున తలకు తీవ్ర గాయాలు కాగా అమ్మ ఓబులమ్మకు, తండ్రి బాలమునెయ్య, తమ్ముడు ఈశ్వరయ్యలకు స్వల్ప గాయాలయ్యాయన్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణం అంబకపల్లె వెళ్లే రహదారిలో ఉన్న కాలువలో ఆదివారం గల్లంతైన వేముల మండలం మబ్బుచింతలపల్లె గ్రామానికి చెందిన రామాంజనేయులు మృతదేహం లభ్యమైంది.

పులివెందుల అర్బన్ సీఐ నరసింహులు ఆధ్వర్యంలో పోలీసులు, ఫైర్ స్టేషన్ సిబ్బంది సోమవారం ఉదయం సుమారు రెండు గంటల పాటు గాలింపు చర్యలు చేపట్టి రామాంజనేయులు మృతదేహాన్ని కనుగొన్నారు. మృతునికి భార్య లక్ష్మీనారాయణమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. రామాంజనేయులు పులివెందుల పట్టణంలోని ఎర్రగుడిపల్లెలో నాలుగేళ్లుగా నివసిస్తున్నాడు. రామాంజనేయులు యూసీఐఎల్‌లో పనిచేస్తూ తమ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ నేపథ్యంలో కుటుంబం పెద్దదిక్కు కోల్పోవడంతో భార్యా పిల్లలు బోరున విలపిస్తున్నారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ నరసింహులు తెలిపారు.



రామాంజనేయులు మృతదేహం

రాయలసీమ స్థాయిలో లెదర్ బాల్ టోర్నమెంట్

జమ్మలమడుగు : క్రిస్మస్, నూతన సంవత్సరం పురస్కరించుకుని రాయలసీమ స్థాయిలో లెదర్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్లు వై.కె.కిరణ్, విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సీఎస్‌ఐ గ్రౌండ్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రికెట్ పోటీలలో పాల్గొనదలచిన టీం రూ.1500 ఎంట్రీ ఫీజు చెల్లించి ఈనెల 20వతేదీ లోపు పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. 21వతేదీ నుంచి క్రికెట్ పోటీలు ప్రారంభమవుతాయన్నారు. విజేతలకు మొదటి బహుమతి రూ.70వేలు, రెండో బహుమతి రూ.40వేలు, మూడో బహుమతి రూ.15 వేలు ఇస్తారన్నారు. వివరాలకు 9666198552 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

మద్యం తాగేందుకు వెళితే.. దొంగ అనుకుని కొట్టారు

మదనపల్లె : స్నేహితులతో కలిసి మద్యం తాగేందుకు వెళ్లిన ఓ యువకుడిని, దొంగతనానికి వచ్చాడని భావించి చితకబాదిన ఘటన ఆదివారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. పట్టణంలోని ఈశ్వరమ్మకాలనీకి చెందిన బాబీ, ముగ్గురు స్నేహితులతో కలిసి ఆదివారం రాత్రి మద్యం తాగేందుకు కొత్తపల్లె సమీపంలోకి వెళ్లాడు. మద్యం సేవించిన తర్వాత గ్రామంలో ఓ ఇంటివద్దకు రాగా, యువకులు దొంగతనానికి వచ్చారని భావించిన కుటుంబ సభ్యులు.. బాబీని బంధించి కొట్టారు. అతడి స్నేహితులు అక్కడి నుంచి పారిపోయారు. దొంగతనానికి వచ్చారని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో తాలూకా ఎస్‌ఐ చంద్రమోహన్ ఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. మద్యం తాగేందుకు వచ్చినట్లుగా నిర్ధారించి యువకుడిని స్టేషన్‌కు తరలించారు. కౌన్సెలింగ్ అనంతరం పంపేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

రామాపురం : కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం మండలం బండపల్లి పంచాయతీ ఆటోనగర్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలగిరి నాగయ్య(71) మృతి చెందాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు రాయచోటి పట్టణం మాసాపేటకు చెందిన పాలగిరి నాగయ్య, గూడూరు బాషా కలిసి ఏపీ04 ఎస్ 8665 టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనంలో ఆదివారం కడపలో జరిగిన సమావేశానికి హాజరై ఇంటికి తిరిగి వస్తుండగా రాయచోటి సమీపంలోని ఆటోనగర్ వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వెంకటసుధాకర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నాగయ్య పరిస్థితి విషమించడంతో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పంచాయతీ కార్యదర్శి అవినీతిపై విచారణ

పీలేరు : గతంలో ప్రొద్దుటూరు మండలం గోపవరం పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి, ప్రస్తుతం పీలేరు ఈఓగా పని చేస్తున్న గురుమోహన్ అవినీతిపై ప్రొద్దుటూరు మండలం గోపవరం గ్రామ పంచాయతీలో అధికారులు విచారణ చేపట్టారు. వివరాలిలా.. పీలేరు ఈవో గురుమోహన్ 2019 – 2022 మధ్యకాలంలో గోపవరం గ్రామ పంచాయతీలో కార్యదర్శిగా పని చేశారు. ఆ సమయంలో ఇళ్ల నిర్మాణాలకు, లేఅవుట్లకు పంచాయతీ అప్రూవల్‌కు సంబంధించి అనేక అవకతవకలకు పాల్పడినట్లు, నకిలీ బిల్లులు సృష్టించినట్లు, గ్రామ పంచాయతీకి సంబంధించి రూ. 5 కోట్ల నుంచి రూ. 7 కోట్ల వరకు నష్టం చేకూర్చినట్లు గోపవరం పంచాయతీ విరాట్‌నగర్ కాలనీకి చెందిన మార్తల వెంకటసుబ్బారెడ్డి ఈ ఏడాది అక్టోబర్ 18న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తోపాటు రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఆదేశాలు అందుకున్న అధికారులు విచారణ ప్రారంభించారు. జెడ్పీ సీఈఓ ఆదేశాలతో డీఎల్‌పీఓ తిమ్మక్క, గోపవరం పంచాయతీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. పంచాయతీ కార్యాలయంలో అవినీతితోపాటు గతంలో ఓ మహిళను వేధించినట్లు ఇతనిపై ఆరోపణలు ఉన్నాయి. బాధ్యతలు చేపట్టిన వెంటనే పీలేరులోనూ గురుమోహన్ అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ 24న పీలేరు గ్రామ పంచాయతీలో అప్రూవల్ కోసం రూ. లక్ష లంచం అడగడంతో బాధితుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. అధికారులు సమగ్ర విచారణ జరిపి గురుమోహన్‌పై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.



విచారణ జరుపుతున్న అధికారులు


కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలి



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కడప వైఎస్సార్ సర్కిల్ : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీని అమలు చేయాలని సీపీఎం కడప నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ సోమవారం కడప నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ సర్కిల్‌లో సీపీఎం కడప నగర కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ బిల్లుల దగ్ధం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూటమి నేతలు అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచబోమని హామీ ఇచ్చారన్నారు. ఈ హామీ అమలుకు కట్టుబడి ఉండాలని డిమాండ్ చేశారు. ప్రతి వినియోగదారుడి మీద సాధారణంగా వచ్చే బిల్లుకు అదనంగా 60 నుంచి 120 శాతం దాకా భారం పడిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, కుమారస్వామిరెడ్డి, చంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



శంకర్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు

కడప వైఎస్సార్ సర్కిల్ : ఆటో కార్మికులకు పీఎఫ్, ఈఎస్‌ఐ, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ అనుబంధ ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దిలేటి డిమాండ్ చేశారు. సోమవారం ఆటో కార్మిక సమస్యలు పరిష్కరించాలని కడప నగరంలోని ఆర్డీఓ కార్యాలయంలో కడప రెవిన్యూ డివిజనల్ పరిపాలన అధికారి శంకర్ రావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే డీజిల్, పెట్రోల్, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ తగ్గిస్తామని, బ్యాడ్జి ఉన్న ట్రక్కు డ్రైవర్‌కి సంవత్సరానికి రూ.15000 వాహన మిత్ర ఇస్తామని, డ్రైవర్లకు వ్యక్తిగత ప్రమాద బీమా పాలసీ అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చాక వీరి గురించే పట్టించుకోలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ కడప నగర అధ్యక్ష కార్యదర్శులు వి. పుల్లయ్య, ఏ.నారాయణ, నగర నాయకులు. సుబ్బరాయుడు, రెడ్డయ్య, ప్రతాప్, జయరాముడు, సునీల్ కుమార్, నాగేంద్ర పాల్గొన్నారు.

జోయా లుక్కాస్ జ్యువెలరీ షోరూం ప్రారంభం

కడప కల్చరల్ : ప్రముఖ బంగారు, వెండి, వజ్రాభరణాల షోరూం జోయా లుక్కాస్‌ను అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలో ఏర్పాటు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా పేరున్న ఈ సంస్థ షోరూంను సోమవారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి మండిపల్లి హరిత ప్రారంభించి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు షోరూం నిర్వాహకులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికి బొకే అందజేశారు. ఈ సందర్భంగా షోరూంలో ప్రత్యేక నగల ఎగ్జిబిషన్‌ను మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, బ్రాంచ్ ఇన్‌చార్జి ప్రీతీష్ జోసెఫ్ తెలిపారు. షోరూంను ప్రారంభించినందుకు ధన్యవాదాలు తెలిపారు.



షోరూం ప్రారంభం సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి సతీమణి హరిత

వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి

కడప సెవెన్‌రోడ్స్ : వెనుకబడిన రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని అఖిలపక్ష నేతలు సోమవారం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ జిల్లాల్లో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలన్నారు. విభజన చట్టం ప్రకారం కడప ఉక్కు పరిశ్రమను పూర్తి చేసి నిరుద్యోగ యువతకు అవకాశాలు కల్పించాలని కోరారు. ఏపీజీబీ ప్రధాన కార్యాలయం, ఎంఎస్‌ఎం ఈ తరలింపు ఆపాలని కోరారు. జిల్లాలో పరిశ్రమలు లేకపోవడంతో ఉపాధి కోసం యువత గల్ఫ్ దేశాలకు వెళుతోందన్నారు. బుందేల్‌ఖండ్ తరహాలో రాయలసీమ అభివృద్ధికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నేతలు నారాయణ, సుబ్బరాయుడు, గుర్రప్ప, శంకర్, కిశోర్, అంజి, కృష్ణమూర్తి, నాగేంద్ర, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



జేసీకి వినతిపత్రం సమర్పిస్తున్న అఖిలపక్ష నాయకులు

పంచాయతీ కార్మికులకు వేతనాలు ఇవ్వాలి

గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న స్వచ్ఛ భారత్ కార్మికులకు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మనోహర్ సోమవారం జేసీ అదితిసింగ్‌కు వినతి పత్రం సమర్పించారు. జమ్మలమడుగు ప్రాంతంలోని కొన్ని గ్రామాల్లో కేవలం రూ. 3 వేలు ఇస్తామంటున్నారని తెలిపారు. జనాభా ఆధారంగా రూ. 6–10 వేలు ఇవ్వాలని కోరారు.

చక్కటి సాధనతోనే ఉత్తమ ఫలితాలు

డీఎస్‌డీఓ కె. జగన్నాథరెడ్డి

కడప స్పోర్ట్స్ : క్రీడాకారులు బాగా సాధన చేయడం ద్వారానే జట్టు ఉత్తమ ఫలితాలు సాధిస్తుందని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె.జగన్నాథరెడ్డి తెలిపారు. సోమవారం కడప నగరంలోని వైఎస్సార్ ఇండోర్ స్టేడియంలో కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కబడ్డీ జూనియర్ విభాగం బాలబాలికల ఎంపికలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఎస్‌డీఓ మాట్లాడుతూ చక్కటి క్రీడ కబడ్డీ అని.. బాగా సాధన చేయడంతో పాటు జట్టు సభ్యులందరూ సమన్వయంతో ఆడితేనే విజయాలు సాధ్యమన్నారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి ఆర్. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా రావులపాలెంలో నిర్వహించే అంతర్ జిల్లాల కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం ఎంపికలు నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ జేవీ సుబ్బన్న, ప్రతినిధులు కొండయ్య, గురుశేఖర్, కబడ్డీ శిక్షకుడు ఆర్.వి. శ్రీధర్, ఫిజికల్ డైరెక్టర్ సావిత్రి, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్‌డీఓ కె. జగన్నాథరెడ్డి

పది టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

రాజంపేట : మన్నూరు బైపాస్ రోడ్డులో పది టన్నుల రేషన్ బియ్యం, లారీని పట్టుకున్నట్లు మన్నూరు సీఐ ఎస్‌ఎండీ అలీ తెలిపారు. అక్రమంగా బియ్యం తరలిస్తున్న వారిలో వెంకటగిరి పట్టణం మాసాపేటకు చెందిన కంపా అంకయ్య ప్రస్తుతం రాంనగర్‌లో నివాసం ఉంటున్నారు. అలాగే గుంతకల్‌కు చెందిన మోటు రాఘవయ్య ప్రస్తుతం భువనగిరిపల్లె ఆర్చి సమీపంలో ఉంటున్నారన్నారు. వీరిని అరెస్టు చేశామన్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా సమాచారం రావడంతో రాజంపేట–తిరుపతి బైపాస్‌రోడ్డులో వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశామన్నారు. పుల్లంపేట మండలం రెడ్డిపల్లె గ్రామానికి చెందిన మల్లికార్జునరెడ్డి సూచన మేరకు వీరు చౌకబియ్య అక్రమ రవాణా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. లారీ, రేషన్ బియ్యాన్ని రెవెన్యూ శాఖకు అప్పగించామన్నారు.

భాష, సాహిత్యాలకు బ్రౌన్ సేవలు నిరుపమానం

కడప కల్చరల్ : విదేశీయుడైన బ్రౌన్ మహాశయుడు తెలుగును అభిమానించి భాష, సాహిత్యాలకు చేసిన సేవలు నిరుపమానమని విశ్రాంత రాజనీతిశాస్త్ర ఆచార్యులు, ప్రముఖ పౌరహక్కుల సంఘం నాయకులు ఆచార్య జి.హరగోపాల్ పేర్కొన్నారు. 'తెలుగు సూర్యుడు' సి.పి. బ్రౌన్ స్మారకంగా నిర్మించిన సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రౌన్ తాళపత్రాల్లో ఉన్న అపార సాహిత్య సంపదను కాపాడడం కోసం జీవితమంతా శ్రమించారన్నారు. పండితులను స్వయంగా పోషించి పలు గ్రంథాలను తిరిగి రాయించడం , ముద్రించడం ద్వారా భావితరాలకు అందించారన్నారు. తెలుగులో ఒక ప్రామాణికమైన నిఘంటువును ఆంగ్లేయుడైన బ్రౌన్ రచించడం విశేషమన్నారు. వేమన మహాకవిని ప్రపంచానికి పరిచయం చేసిన ఘనత సీపీ బ్రౌన్‌దేనన్నారు. గ్రంథాలయాలను రక్షించుకోవాలని, అప్పుడే చరిత్రతోపాటు జ్ఞానం సంపాదించుకోవచ్చన్నారు. మాతృభాషలో పలు అనుభవాలు, ఆచారాలు, వ్యవహారాలతో ముడిపడిన అనేక అంశాలుంటాయని, అందువల్ల మన తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. విద్యావిధానంలోని లోపాల వల్ల విద్యార్థుల్లో మానవ విలువలు లోపించడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఆ తర్వాత జానమద్ది సాహితీ పీఠం మేనేజింగ్ ట్రస్టీ జానమద్ది విజయ భాస్కర్, విజయలక్ష్మి దంపతులు ఆయనను సత్కరించారు. బ్రౌన్ గ్రంథాలయ ప్రచురణలను, గౌరవ సభ్యత్వాన్ని సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, గ్రంథాలయ సహాయకులు జి.హరిభూషణరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో గుర్రప్ప, గుర్రాల గోపాల్, శివశంకర్ రెడ్డి, జగదీశ్ రెడ్డి, రంగప్ప తదితరులు పాల్గొన్నారు.



ప్రొఫెసర్ హరగోపాల్‌కు బ్రౌన్ గ్రంథాలయ సభ్యత్వాన్ని అందజేస్తున్న సిబ్బంది